# రేపటి సూర్యుడు

ఆఫీసుకు వచ్చానో, లేదో, ఓ ఫైలును నా ముందుంచి - "సాయంత్రాని కల్లా ప్రాజెక్టు రిపోర్టు కావాలిట. బాస్ మిమ్మల్ని స్వయంగా తయారు చేయ మన్నారు" అన్నాడు సీనియర్ అసిస్టెంట్ భాస్కరరావు. "రేపే కలెక్టరేట్‌లో మీటింగు. హైదరాబాద్ నుండి అడిషనల్ రిజిస్ట్రారు కూడా వస్తారట" అని కూడా చెప్పాడు.

అతనిచ్చిన ఫైలులో మునిగిపోయాను.

మధ్యాహ్నం రెండు గంటలయి ఉంటుంది. అటెండరు ఏసురత్నం వచ్చి "తమరి కోసం. ఓ ముసలాయన, ఓ అబ్బాయి వచ్చారు" అన్నాడు.

"ఇప్పుడు కాదు పనిలో ఉన్నారు, రేపు రమ్మన్నారు అని చెప్పు" అన్నాను.

ఏసురత్నం కదలలేదు 'ఏమిటి' అన్నట్లు చూశాను.

"చాలా పెద్దాయన, పైగా తమరికి తెలుసేమో! గంట నుండి మీరు పనిలో ఉన్నారన్నా అలాగే కూర్చున్నారు."

క్షణం ఆలోచించి రమ్మన్నాను.

"మనోరంజనం గారు మీరే కదూ!" అన్నారాయన లోపలికి వచ్చి నమస్కారం పెడతూ.

"అవునండీ!" అన్నాను తిరిగి నమస్కరించి, కూర్చో మన్నట్లు కుర్చీ చూపుతూ.

డెబ్బయి ఏళ్ళుంటాయి. పూర్తిగా పండిపోయి సగం పైగా రాలిపోయిన

జుత్తు. ఎక్కడో చూసినట్లనిపించింది. కాలేజి స్టూడెంటులా కనిపిస్తున్న ఆ కుర్రవాణ్ణి కూర్చో మన్నాను.

వద్దన్నట్లు అతన్ని వారిస్తూ, "నా పేరు సీతారామయ్య. బహుశా మీకు గుర్తున్నానో, లేదో మీ మిత్రుడు రఘురాం మా అబ్బాయే!" అన్నారాయన.

గబుక్కున గుర్తు కొచ్చారు. పది సంవత్సరాల క్రితం - అప్పట్లో రఘురాం హైదరాబాద్‌లో పనిచేస్తున్నాడు. అసోసియేషన్ పని మీద నేనక్కడకు వెళ్ళగా పట్టు పట్టి తనింటికి భోజనానికి తీసుకుని వెళ్ళాడు. ఆనాడు చూశాను వారిని.

"అయ్యో! మీరా?" అనే మాటలు అప్రయత్నంగా వెలవడ్డాయి నోటి నుంచి.

ఆయన కనుల నిండా కమ్మిన కన్నీరు.

నా నేత్రాలూ ఆర్ద్ర మయ్యాయి.

రఘురాం. నేనూ కోపరేటివ్ ఇన్‌స్పెక్టరులుగా ఒకేసారి సర్వీసు కమిషను సెలక్షను పొంది, ఒకే బాచ్‌లో హైదరాబాద్‌లో సంవత్సరం పాటు ట్రెనింగ్ అయ్యాం. ఆ సంవత్సర మంతా ఒకే రూములో ఉండటం మూలంగా సన్నిహితుల మయ్యాం. ఆ తర్వాత వేర్వేరు చోట్ల పనిచేసినా తరుచూ కలుస్తూ ఉండేవాళ్ళం. దగ్గర దగ్గర ఒకేసారి సబ్ రిజిస్ట్రార్లుగా ప్రమోటవ్వగా, అతను నెల్లూరు జిల్లా వెళ్లాడు. నేను సరసరావుపేట బదిలీ అయ్యాను. ఆ తరువాత మా కలయికలు ఆగిపోయాయి. ఒకరి వార్త లొకరికి కదాచిత్‌గా తెలియటమే!

సంవత్సరం క్రితం రఘురాం హార్ట్ ఎటాక్‌తో పోయాడని వార్త తెలిసింది. చాలా అలస్యంగా అందిన వార్త మూలంగా వాళ్ళ కో కండొలెన్స్ జాబైనా రాయలేకపోయాను.

"ఈ వయసులో నాకు వీడినీ, వీడి చెల్లినీ, తల్లినీ అప్పగించి పోయాడు.' ' కన్నీటిని వెలికి రానివ్వకుండా ప్రయత్నిస్తూ అన్నారాయన.

ఆయన్ను చూస్తుంటే జాలి వేసింది. కొడుకు రక్షణలో నిశ్చింతగా కాలం గడపవలసిన వయసు. అది తొణికిపోగా పైగా బరువులు, బాధ్యతలు!

"వాడు పోయాక కుటుంబ పరిస్థితి కొంచెం క్రిందా, మీదా అయింది.

రావలసిన ఫామిలీ పెన్షను, తదితరాలు ఎవో కారణాల వల్ల ఆలస్యమయ్యాయి. అయినప్పటికీ వీడికి పద్దెనిమిది సంవత్సరాలు వెళ్ళలేదు. మరో సంవత్సరం ఆగి దరఖాస్తు పెట్టుకోమన్నారు. పోయిన నెలలో దరఖాస్తు చేస్తే, జూనియర్ అసిస్టెంటుగా ఉద్యోగం ఇచ్చి ఈ ఆఫీసుకు వేశారు." అంటూ ఆర్డరు కాగితం నాముందుంచారు సీతారామయ్యగారు.

"పోనీలెండి!" నిట్టూర్చాను.

రఘురాం కొడుక్కేసి తిరిగి - "ఏం చదివావు?" అడిగాను.

"బి.ఎస్.సి. ఫస్టు ఇయర్‌లో ఆపివేశాను."

జాలిగా అతని కేసి చూశాను.

"మా రఘు ఎప్పుడూ మిమ్మల్ని అనుకునేవాడు. ఇక్కడ మీరున్నారని తెలిసి మీకు అప్పగిద్దాం వీణ్ణని వచ్చాను. అక్కడా మాకేం పని లేదు. వీడి చెల్లి ఇంటర్ చదువుతోంది. ఓ రెండు నెలల్లో పరీక్షలు అయిపోగానే వచ్చేస్తాం."

"ఓ! మీరేం బెంగ పెట్టుకోకండి. ఈ రోజే ఉద్యోగంలో చేరి, నా వద్దే ఉంటాడు." అన్నాను.

అపాయింట్‌మెంట్ ఆర్డరులో చూశాను. అతని పేరు శివాజీ. శివాజీని తీసుకుని మా ఆఫీసర్ దగ్గరకు వెళ్ళి ఆర్డరు ఆయన కిచ్చి శివాజీని పరిచయం చేశాను.

"అవును, మనకూ ఈ రోజే జాయింటు రిజిస్ట్రారు నుంచి ఆర్డర్సు వచ్చాయి." అన్నారాయన.

నా పర్యవేక్షణ క్రింద వున్న సెక్షను ఖాళీలో వేయించి, శివాజీ జాయినింగ్ రిపోర్టు తీసుకున్నాను.

ఆ మరునాడు తాను తిరిగి వెళ్ళబోయే ముందు సీతారామయ్యగారు - "వీడు ఒంటరిగా ఎన్నడూ ఉన్నవాడు కాదు. అమాయకుడు, బిడియస్తుడు. మీరే వాణ్ణి ప్రయోజకుణ్ణి చేయాలి" అన్నారు.

"శివాజీని మా అబ్బాయిలా చూసుకుంటాను. సరేనా!" అని ధైర్యం చెప్పి పంపానాయన్ని.

ఓ నెల రోజులు శివాజీని గమనించాను. ఆఫీసు పనిని ఇట్టే అర్థం చేసుకుని అల్లుకుపోవటం గమనించానతనిలో. "పాత సర్క్యులర్స్ చదవాలి. ఆ చదివిన దానిని క్షుణ్ణంగా అర్థం చేసుకుని. ఆ తర్వాతే ఏ ఫైలునైనా డీల్ చేయాలి" అని నే చెప్పిన విషయాలను తూ.చా. పాటించేవాడు. అతను ఫైలుపై పెట్టిన నోటింగులు చదివి, అతని నిశితమైన వ్యాఖ్యలకు నేనే ఆశ్చర్యపోయేవాణ్ణి!

మరో విషయం కూడా గమనించాను.

సీతారామయ్యగారన్నట్లు శివాజీ అమాయకుడు కాదు. బిడియస్తుడంతకంటే కాదు. చురుకైన వాడు. కాకుంటే ముక్కు సూటిగా వ్యవహరించే తత్వం. బహుశా ఆ ముక్కు సూటితనాన్నే సీతారామయ్యగారు అమాయకత్వం అన్నారేమో! ముక్కు సూటిగా వ్యవహరించే తత్వానికి అమాయకత్వం అనే నామాంతరం ఉందా అని నేననుకుంటున్న తరుణంలో...

ఓ ఫైలుపై మా ఆఫీసరుగారు కొంచెం ఆశ్రిత పక్షపాతంతోనో, మరెందు చేతనో వేసిన ఆర్డరును ఉదహరిస్తూ అలా ఆర్డరు వేయటం ఎలా అనుచితమో, అలాంటి అనుచితమైన చర్య ఎంతటి పచ్చి అధికార దుర్వినియోగమో, ఆ అధికార దుర్వినియోగం ఎంతటి క్షంతవ్యం కాని దోషమో వివరిస్తూ మోతాదుకు మించిన భావావేశంతో ఆ ఫైలుపై ఉత్తర్వులను పున: పరిశీలించవలసిందిగా నోట్ రాసి తిప్పి సమర్పించాడు శివాజీ.

ఇదంతా నేనో కాంపు మీద అర్జెంటుగా నాగార్జున సాగర్ వెళ్లిననాడు జరిగింది. శివాజీ రాసిన నోట్ చదువుకున్న మా ఆఫీసరు. కాంపు నుండి తిరిగి వచ్చిన నన్ను తన గదిలోకి పిలిచి- "ఏమిటిది?"అంటూ ఆ ఫైలు నా ముందుకు నెట్టారు.

శివాజీ నోట్ చూసి తెల్లబోయాను.

ఎదురుగా ఉన్న ఆయన మొహంలో ఉరుములు, మెరుపులు కనిపించాయి. పిడుగులు పడటమే తరువాయి అన్నట్లుంది పరిస్థితి.

"క్షమించండి! ఈ ఫైలు నా ద్వారా మీకు రాలేదు" అంటూ ప్రారంభించి, "కొత్త కుర్రవాడు ఎవరి పట్ల ఎలా నడచుకోవాలో ఇంకా సరిగా తెలియదు"

అంటూ శివాజీ తరుపున కూడా క్షమాపణ వేడుకుంటూ - ఈ ఫైలుపై ఉన్న నోట్ ఫైలును తమ ఉత్తర్వుల మేరకు సవరింప చేసి పట్టుకు వస్తాననే సమాధానపు సరళి మాటలు మాట్లాడాను.

"మీరు అతనిపట్ల సానుభూతిపరులని మన్నిస్తున్నాను. లెట్ హిం బిహేవ్ హిమ్ సెల్ఫ్ " అన్నారాయన తమాయించుకుని.

బయటకు వచ్చి శివాజీని పిలిచి, "ఉద్యోగం అంటే ఏమనుకున్నావు? అది నీ చేతిలోని విచ్చు కత్తి కాదు, నీ ఇష్టం వచ్చినట్లు విన్యాసం చేయటానికి. పెద్దా, చిన్న అన్న జ్ఞానం, పై ఆఫీసరూ, క్రింది ఉద్యోగీ అన్న జ్ఞానం లేకుంటే ఎలా? నీ స్థాయికి ఆయన గారి విచక్షణను ప్రశ్నించటం నీకేపాటి తగు మర్యాద?" అంటూ కేకలేశాను.

శివాజీ తిరుగు మాట్లాడక నా మాటలు వింటూ ఉండిపోయాడు. అంతలోనే - 'వాడో అమాయకుడు. వాణ్ణో ప్రయోజకుణ్ణి మీరే చేయాలి' అన్న సీతారామయ్యగారి మాటలు జ్ఞాపకం వచ్చి, "చూడు శివాజీ! పై అధికారి ఓ ఆర్డరు పాస్ చేయటానికి ఏవో కారణాలు అనేకం ఉంటాయి. క్రింది ఉద్యోగులుగా వారి పట్ల విధేయత ప్రకటించి, ఆ ఆర్డరును అమలు పరచటం మన కర్తవ్యం. ఆ ఉత్తర్వుల మంచి చెడులతో మన కేమిటి?" అంటూ అనునయించాను.

ఈ సారి శివాజీ మరేం మాట్లాడలేదు. నా మాటలు ఆలకిస్తూ ఉండిపోయాడు.

"పోనీలే! అయిపోయిం దేదో అయిపోయింది. నీ తరపునా వారికి నేనే క్షమాపణ చెప్పాను. ఈ ఫైలు తీసుకుని పోయి, నోట్ మార్చి, ఉత్తర్వుల కనుగుణంగా వ్రాసి తీసుకుని రా!" అంటూ ఫైలు ఇవ్వబోయాను.

శివాజీ ఫైలు తీసుకోకుండా.., "క్షమించండి! మీ రన్నవన్నీ మీ మీద గౌరవంతో విన్నాను. ఇప్పటికీ మీ మీద నాకు గౌరవమే! కానీ అంత మాత్రాన నా అభిప్రాయాలను మార్చుకోలేను. తప్పు - అది ఎవరు చేసినా తప్పే! అది ఆఫీసరు చేసినా, క్రింది ఉద్యోగి చేసినా సరిదిద్దబడవలసిందే. మీరు నా తరపున క్షమాపణ అడిగి ఉండవలసింది కాదు" అంటూ వెళ్ళిపోయాడు.

అవాక్కై ఉండిపోయిన నాకు ఆ క్షణాన తెలిసింది - ముక్కు సూటీతనానికి - ఆ తత్వానికి అమాయకత్వం అనే నామాంతరం లేదని.

ఇరవై అయిదు సంవత్సరాలు ప్రభుత్వోద్యోగంతో పెనుగులాడిన నాకు అలాంటి సమస్యలను, ఆ మాట కొస్తే ఎలాంటి సమస్యలనైనా ఎలా పరిష్కరించాలో తెలిసిన దిక్కుమాలినన్ని మార్గాలు ఎరుక. ఆ ఫైలును ఎలా, ఏం చేయాలో అలా చేసేశాను.

ఈ సంఘటన తరువాత శివాజీ పట్ల నాకు కోపం పెల్లుబుకలేదు. ఎందుకో అవ్యాజమైన ప్రేమ, గౌరవం పెచ్చరిల్లాయి.

★ ★ ★

శివాజీని గమనిస్తున్న నాకు 'అతగాడు అమాయకుడు కాదు' అనే విషయంలో తిరుగులేని సాక్ష్యం దొరికిన తర్వాత ముక్కు సూటీగా వ్యవహరించే అతని తత్వానికి 'అనుభవ శూన్యత' అనే ఓ రూపాంతర నామం నా మదిలో మెదలాడటం మొదలైంది సరిగ్గా ఆ సమయంలోనే...

మెరుపు లేని ఉరుములా, ఉరుము లేని పిడుగులా కుట్రా కుతంత్రం లేకుండానే ప్రభుత్వం కూలిపోవటం, అర్ధాంతరంగా మధ్యంతర ఎన్నికలు ప్రకటింపబడటం జరిగింది.

ఎన్నికల ఏర్పాట్లలో ప్రభుత్వ పరిజనాలు, వాహనాలు పరుగులు పెట్టడం, ఎన్నికల నిర్వహణకు సిబ్బందిని ఆయుత్తపరచడంలో మునిగిపోయింది యంత్రాంగమంతా!

నియోజక వర్గంలోని కొన్ని ప్రాంతాలకు జోనల్ ఆఫీసరుగా నియమిస్తూ నాకో శ్రీముఖం అందింది. మా ఆఫీసులో సీనియరు, జూనియరు అసిస్టెంట్లకు చాలా మందికి ప్రిసైడింగ్ ఆఫీసర్లూ, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లుగా నియామకాలందాయి.

"నన్ను అసిస్టెంటు ప్రిసైడింగ్ ఆఫీసరుగా కలువపూడి వేశారంకుల్!" అంటూ శివాజీ తన నియామక పత్రాన్ని చూపాడు.

క్షణకాలం ఆలోచించాను.

గత ఇరవై అయిదు సంవత్సరాలుగా ఈ ఎన్నికల బాధ్యతలను నిర్వహిస్తూ, నానాటికీ అవి ఎలా కష్టతరమవుతున్నాయో చూస్తున్న వాడి నవ్వటాన - శివాజీని, అందునా ప్రభుత్వోద్యోగంలో కొత్తగా కాలిడిన వాణ్ణి ఈ ఎన్నికల డ్యూటీ నుంచి తప్పించటం మంచిదేమో అనిపించింది-

"పోనీ అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసరు నాకు తెలిసినవాడే! ఆయనతో మాట్లాడి నీకీ బాధ్యత తప్పించనా?' అని అడిగాను.

"ఎందు కంకుల్?" ప్రశ్నించాడు.

"ఎందుకేమిటి? వెళ్ళవలసింది ఎన్నికల నిర్వహణకు - హనీమూన్‌కు కాదు. వెళ్ళిన చోట ఎలాంటి ఏర్పాట్లూ ఉండవు, కూడు, నీరు దొరకవు సరికదా, ఒక్కొక్కసారి క్షేమంగా తిరిగి రావటమే గగనకుసుమం, గ్రామాలు తాతలనాటిలా లేవు. పార్టీలు, ఘర్షణలు, రాళ్ళు రువ్వుకోవటాలు, రైడింగులు... ఆ బీభత్సం నుంచి తప్పించుకు రావటం పద్మవ్యూహం నుంచి బయటకు వచ్చినంత. ఎందు కొచ్చిన బెడద. నీవా, అలాంటి బాధ్యతల నిర్వహణలో అనుభవం ఉండిన వాడివి కూడా కాదు" అన్నాను.

"ఓసారి అలాంటి డ్యూటీ చేస్తే కదా అనుభవం వచ్చేది?" అన్నాడు శివాజీ నా మాటలు అన్నీ విని.

శివాజీతో వచ్చిన చిక్కే ఇది. మనం చెప్పేదంతా విని, కూల్‌గా ప్రశ్నలాంటి జవాబు ఇస్తాడు. ఆదేమిటో, దానికి తిరుగు జవాబు మన దగ్గర లేదన్నట్లనిపిస్తుంది.

"సరే! నీ ఇష్టం" అన్నాను.

"నా ఇష్టం అని కాదంకుల్! సర్వీసులో ఉన్నంతకాలంలో ఎప్పుడో ఒకప్పుడు ఉండే బాధ్యతలే కదా ఇవి. వయసు, ఓపిక ఉన్న ఈనాడు కాకుంటే మరెప్పుడు నిర్వహించగలం వీటిని? అయినా బాధ్యతల నుంచి పారిపోవటం ఏమిటి చెప్పండి?" అన్నాడు శివాజీ.

అతగాడి ముక్కు సూటీతనం వెనకాల ఒక క్రమబద్ధమైన ఆలోచన చూచాయగా కనిపించింది నాకా క్షణాన. ఈసారి నా సలహాను త్రోసిం జన్నప్పటికీ ఎందుకో అతని వైఖరికి ముచ్చటేసింది.

జోనల్ ఆఫీసర్‌గా ఎన్నిక తేదీకి ఒకటి రెండు రోజుల ముందే నా పరిధిలో ఉన్న అన్ని గ్రామాలను చూస్తూ కలువపూడి వెళ్ళాను. అది ఒక రూట్‌లో చిట్టచివరి గ్రామం. ఎన్నికలలో నిలిచిన అభ్యర్థులలో ఒక ముఖ్యమైన పార్టీ అభ్యర్థి మేనమామగారి ఊరది. ఆయనగారి పేరు వీరభద్రయ్య. వీరభద్రయ్య అంటే ఆ చుట్టుపట్ల ప్రాంతాలకు సింహ స్వప్నం. ఆయన చుట్టూ రాక్షసుల్లాంటి పరిజనం ఉంటారు. వాళ్ళ చేతుల్లో బాకులు, జేబుల్లో బటన్ బాంబులు ఉంటాయి. ఆయన కళ్ళలో జీరలు, మెదడు నిండా పురి విప్పిన విషపుటాలోచనలు ఉంటాయి.

గత కొన్నేళ్ళుగా ఆ ప్రాంతాన అతనో రిగ్గింగు చక్రవర్తి. ఆయన అండదండలతోనే అభ్యర్థులు ఎన్నికల బరిలోకి దిగుతారు. ఈసారి సాక్షాత్తూ అతగాడి మేనల్లుడే అభ్యర్థి.

మూడు రోజులనాడు శివాజీ 'బాధ్యతల నుంచి పారిపోవటమా' అని సిద్ధాంతీకరించిన నాడు తన వైఖరికి ముచ్చటేసిన నాకు, వీరభద్రయ్య సమాచారం తెలిశాక భయం వేసింది.

పోలింగు బూతుల తనిఖీ పూర్తి చేసుకుని వచ్చిన నేను వీరభద్రయ్య గుర్తించి సేకరించిన సమాచారం అంతా పూసగుచ్చినట్లు శివాజీకి చెప్పి- "ఇప్పుడైనా మునిగిపోయింది లేదు. ఆయుర్వేదంలో రోగికి ఆఖరి క్షణంలో గరళపు వైద్య మున్నట్లు ఎన్నికలను తప్పించుకోవటానికి ఓ ఆయుధం ఉంది. అది - అర్జెంటుగా 'సిక్' అయిపోవటం" అని సూచించాను.

"మీరు మరీ భయస్తులు అంకుల్! అనవసరంగా ఆందోళన పడకండి" అంటూ నా సలహాను తేలిగ్గా తీసివేసి, "ప్రశాంతంగా నిద్రపొండి, పరవాలేదు" అని మరో సలహా నాకే పారవేసి మరీ వెళ్ళాడు శివాజీ.

ఈసారి నాకు అతగాడి ముక్కుసూటితనం వెనకాల బలంగా నాటుకుని ఉన్న దేదో నిశ్చయంగా అర్థమైపోయింది. అది అమాయకతా కాదు. అనుభవ శూన్యతా కాదు. అది నిర్భీతి. 'అతగాడో సాహసి' అనిపించింది.

పోలింగు ముందు రోజు నియోజకవర్గపు ముఖ్య పట్టణం నుండి లారీలు,

ఎన్నికలు సామాగ్రి, ఎన్నికల సిబ్బంది, పోలీసులతో సహా అట్టహాసంగా బయలుదేరి ఆయా గ్రామాలకు వెళ్ళాయి. వాటి వెంట రూటు ఆఫీసర్లు. ఆ రూటుల నన్నింటినీ కలుపుకుంటూ జోనలాఫీసర్ల జీపులూ ప్రయాణించాయి.

రూటు ఆఫీసర్ల నివేదికలు తీసుకుంటూ, మధ్య మధ్య వాటిని తనిఖీ చేసుకుంటూ కలువపూడి చేరాను. ఆ రాత్రి పొద్దుపోయాక ఎన్నికల సిబ్బంది అంతా వచ్చారు. కానీ ప్రిసైడింగ్ ఆఫీసరు అక్కడి చేరాక 'సిక్' అయిపోయాడు. అసలే బి.పి., షుగర్ పేషెంటట! దానికి తోడు మధ్యాహ్నం ఎండలో, ఆచ్ఛాదన లేని లారీలోపడి రావటంతో కళ్ళు తిరిగి పడిపోయాడు. జ్వరం, మధ్య మధ్య వాంతులు.

"అంకుల్! వీరిని వెంటనే టౌన్‌కు తీసుకువెళ్ళి వైద్య సదుపాయం సమకూర్చాలి. మీ జీపులో తీసుకు వెళ్ళండి" అన్నాడు శివాజీ.

అతణ్ణి పరిశీలిస్తే పరిస్థితి అలాగే ఉంది. శివాజీని పక్కకు పిలిచి- "చూడు శివాజీ! ఈయనను టౌనుకు పట్టుకు వెళితే, ప్రిసైడింగ్ ఆఫీసరు బాధ్యతలన్నీ నీ నెత్తిన పడతాయి. మీ పోలింగ్ బూత్‌కు మరో ప్రిసైడింగ్ ఆఫీసర్ని పంపించగలమని నే ననుకోను" అన్నాను.

శివాజీ నా కేసి విచిత్రంగా చూసి- "మరి... అందుకని ఆయనకు వైద్యం లేకుండా ఉంచుదామంటారా?" అన్నాడు.

చప్పున అర్థమయింది నేనేం మాట్లాడానో. శివాజీ క్షేమం పట్ల ఉన్న నా ఆలోచనలు నన్ను పూర్తిగా విచక్షణారహితుణ్ణి చేస్తున్నాయన్న మాట.

"అలా అని కాదు" అని నేను ఏదో చెప్పబోయేంతలోనే అందుకొని- "కానివ్వండి! నేనే ఆ బాధ్యతల్ని తీసుకుని ఎన్నికలు జరుపుతాను. కాకుంటే కొంచెం అధిక శ్రమ. అంతే కాని, ఈ స్థితిలో ఆయన్ను వైద్యం లేకుండా ఉంచటం న్యాయమా?" అన్నాడు శివాజీ.

ఆ ప్రిసైడింగ్ ఆఫీసరుగారిని జీపులో ఎక్కించుకుని టౌన్‌కు తీసుకువచ్చి, హాస్పిటల్లో చేర్చి, వారి కుటుంబ సభ్యులకు ఆ వార్త తెలియచేసి, ఆ తరువాత రిటర్నింగ్ ఆఫీసరుగారిని కలిశాను.

ఆపాటికి అర్థరాత్రి రెండు గంటలయింది.

"ఇప్పుడిక కలువపూడికి మరో ప్రిసైడింగ్ ఆఫీసర్ని పంపలేము. రిజర్వులోని వారందరినీ సర్దివేశాము. రూల్సు మేరకు అక్కడి అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసరు ఆ ఎన్నిక నిర్వహించాల్సిందే" అన్నారు రిటర్నింగ్ అఫీసరు.

"అవుననుకోండి కానీ, అతను కొత్తగా ఉద్యోగంలో చేరినవాడు. అనుభవం లేని వాడు" అన్నాను.

"ఈ పరిస్థితులలో నన్నేం చేయమంటారు? నా స్థానంలో మీరున్నా రనుకొని ఏం చేస్తారో చేయండి. నా కభ్యంతరం లేదు." కొంచెం విసుగు ధ్వనించింది ఆయన మాటల్లో.

ఆ ఆఫీసు వరండా అంతా వెతికాను రిజర్వులో ఉన్న ఉద్యోగుల కోసం. అందరూ వెళ్ళిపోయారట. ఒకే ఒక రిజర్వు పోలింగు క్లర్క్ ఓ టేబులు మీద దోమలను తోలుకుంటూ సగం నిద్రలో కనిపించాడు. అతనిని నిద్ర లేపి, "కలువపూడి వెళ్ళాలి" అన్నాను.

"అంతకంటేనా! మహద్భాగ్యం" అంటూ జీప్ ఎక్కి కూర్చున్నాడు.

ఆయన అదేదో అప్పర్ ఎలిమెంటరీ స్కూలు ఉపాధ్యాయుడట! తెలతెలవారబోతుండగా అతగాణ్ణి కలువపూడిలో దింపి, శివాజీకి అప్పగించి - "ఈ పోలింగ్ క్లర్క్‌ని వాడుకుని ఎన్నిక జరిపించు" అన్నాను.

"మీరు చాలా శ్రమ తీసుకున్నారు. చెప్పానుగా! ఎవరున్నా, ఎవరు లేకున్నా ఎలాగోలా ఎన్నిక జరిపిస్తానని" అన్నాడు.

అక్కడి ఏర్పాట్లు ఒకసారి పరిశీలించాను. బందోబస్తుకు ఒకే ఒక కానిస్టేబుల్ ఉన్నాడు.

"ట్రబుల్‌సమ్ విలేజిగా గుర్తించటం వలన ఒక కానిస్టేబుల్‌నైనా ఇచ్చారు సార్! తతిమ్మా గ్రామాలకు గ్రామ నౌకర్లే నండీ!" అన్నాడా కానిస్టేబుల్. అతగాడు నలభై రోజుల టైఫాయిడ్ జ్వరం తరువాత, నాలుగు రోజుల ముందే డ్యూటీకి రిపోర్టు చేశాడట.

ఓ నిట్టూర్పు విడవటం వినా చేయగలిగిందేమీ లేకపోయింది.

శివాజీ నాతో మాట్లాడుతూనే, గ్రామ నౌకర్ల చేత టేబుళ్ళు, కుర్చీలు, పురికొసలు, పట్టాలు తెప్పించటం, మరో పక్క ఓటు పత్రాలపై మార్కింగ్ స్టాంపు వేయించటంలో శివాజీ ఓర్పు, నేర్పు గమనించి - "పరవాలేదు" అనుకుంటూ వెనక్కు బయలుదేరాను.

★ ★ ★

మధ్యాహ్నం ఒంటి గంటా ఆ ప్రాంతంలో రిటర్నింగ్ ఆఫీసరు గారితో ఏదో మాట్లాడుతూ ఉండగా, ఫోనులో మెసేజ్ వచ్చింది - "165వ బూత్‌లో ఉద్రిక్తత ఏర్పడి పోలింగ్ ఆగిపోయిం"దని.

165వ బూత్ అంటే కలువపూడి.

గబుక్కున లేచి, "కలువపూడి అంటే నా ఏరియానే. అదనపు ప్రొటెక్షను ఫోర్సును ఇవ్వండి వెళతాను" అన్నను.

"మనకున్న ఫోర్సు చాలా లిమిటెడ్. దారిలో ఎక్కడో స్ట్రైకింగ్ ఫోర్సు ఉంటుంది. తీసుకుని వెళ్ళండి. ఈలోగా జిల్లా హెడ్ క్వార్టర్స్‌తో మాట్లాడి అదనపు బలగాలను పంపే ఏర్పాట్లు చూస్తాను" అన్నాడు రిటర్నింగ్ ఆఫీసర్.

అదనపు బలగాలు రావటం కల్ల అని ఆయనకూ, నాకూ తెలుసు. అయినా గట్టిగా ప్రయత్నం చేయమని చెప్పి, జీపులో బయల్దేరి నకరికల్లు అడ్డ రోడ్డులో ఉన్న స్ట్రైకింగ్ ఫోర్సు వానును తీసుకుని కలువపూడి చేరాను.

దారి పొడవునా శివాజీ ఎలా ఉన్నాడో అనే ఆందోళన నన్ను కలవర పెడుతూనే ఉంది. కలువపూడి పోలింగ్ బూత్ ముందు క్యూలు లేవు. జనం అంతా గుంపులు గుంపులుగా దొమ్మీకి సిద్ధమై పోలింగ్ బూత్ ఉన్న స్కూలు కాంపౌండు నిండా చేరిపోయి ఉన్నారు. ప్రతివారి చేతిలోను కర్రలు, సీసాలు, బరిసెలు, గొడ్డళ్ళు నానా బీభత్సంగా ఉంది. ఆ దృశ్యం చూస్తుంటేనే భయం, ఆందోళన కలిగాయి.

అతి కష్టం మీద ఆ జనాన్ని చీల్చుకుని. పోలింగ్ బూత్‌లోకి వెళ్ళగలిగాము నేను, సబ్ ఇన్‌స్పెక్టర్. లోపల పోలింగ్ స్టాఫంతా దిగ్బంధంలో ఉన్నట్లు నిలుచుండిపోయి ఉండగా, ఆ మధ్యలో శివాజీ కనిపించాడు. గంభీరమైన మోముతో.

"ఏమయింది?" ప్రశ్నించాను శివాజీని.

"రిగ్గింగు చేయటానికి సిద్ధపడ్డారు వీరు. ప్రత్యర్థుల ఏజంట్లను తన్ని బయటకు తరిమివేశారు. ఓట్లన్నీ ఒక్కరే వేస్తారట! వాటిపై సంతకాలు పెట్టి ఇవ్వమంటున్నారు. 'అలా వీల్లేదు' అని చెప్పాను. దౌర్జన్యం చేస్తామని బెదిరిస్తున్నారు" అన్నాడు శివాజీ.

అక్కడే పోలింగ్ ఆఫీసర్ కుర్చీ నొకదానిని ఆక్రమించి కూర్చుని ఉన్న వీరభద్రయ్య- "ఏమైందో నేను చెపుతాను వినండి! ఇది కలువపూడి. ఇది నా గ్రామం. ఇక్కడ రూలూ నేనే! చట్టమూ నేనే! వాటిని ఎలా అమలు చేయాలో చెప్పే న్యాయస్థానమూ నేనే! ఇక్కడ పోలీసు ఆఫీసరూ నేనే! పోలింగాఫీసరూ నేనే! ఈ గ్రామంలోని ఓట్లు అన్నీ నావే! అందుకే వాటిని నేనే, నే ఒక్కణ్ణే వేసుకుంటాను. ఈ కుర్రకుంక ఏందేందో మాట్లాడుతున్నాడు. తన్ని తగలెయ్యటం ఓ లెక్కలో విషయం కాదు. ఎందుకో ఈ క్షణం వరకు తమాయించాను" అన్నాడు.

అతగాడి వైఖరి, ఆ దౌర్జన్య చిద్విలాసం, ఆ అహంకార ధోరణి పట్ల ఎనలేని కోపం కట్టలు తెంచుకున్నా, అక్కడి పరిస్థితి నన్ను వారించింది. సబ్ ఇన్‌స్పెక్టరు కూడా క్షణ కాలం అక్కడి వాతావరణాన్ని, తన ఎదిరి బలాలను మౌనంగా అంచనా వేసుకుని, సాంత్వన వచనాలతోనే పరిస్థితిని అదుపు చేయాలని ప్రయత్నిస్తూ- "చూడండి వీరభద్రయ్యగారూ! ఈ గ్రామం మీదే! ఆ మాటకొస్తే గ్రామంలో మెజారిటీ కూడా మీదే! కాదన్నది ఎవరు? ఓటర్లందరూ వరుసగా వచ్చి. పోలింగ్‌లో పాల్గొంటే అటు ఎన్నికలూ సక్రమంగా జరిగినట్లుంటుంది. మీకూ, మీ గ్రామానికీ మంచి పేరూ ఉంటుంది" అన్నాడు.

"అదేం కుదరదు. మా ఆనవాయితీ ఇదే. గతంలో అన్ని ఎన్నికలు ఇలాగే జరిపించాము. మా లేబరు పనీ, పాటా మానుకుని ఇక్కడ పడిగాపు పడి ఉండరు. మా ఆడంగులు పోలింగ్ బూతులకు రారు. క్యూలలో గంటల తరబడి నిల్చోరు."

వీరభద్రయ్య మాటలకు చుట్టూ చేరిన అతగాడి పరిజనం హర్షామోదాలు ప్రకటించి, పిచ్చిగా చప్పట్లు చరిచి, ఆవేశంతో రెచ్చిపోతూ, "వీరభద్రయ్యా! జిందాబాద్" అంటూ నినాదాలు ప్రారంభించారు.

ఏం చేయాలో అర్థం కావటం లేదు. మా దగ్గర ఉంది నలుగురు కానిస్టేబుళ్ళు, ఓ సబ్ ఇన్స్పెక్టరు. ఆ మూకను అదుపు చేయటం అసాధ్యమైన పని.

క్షణ కాలం నేను, సబ్ ఇన్స్పెక్టరు అతి మెల్లని గొంతుకలతో, ముఖకవళికలతో, పాడి పాడి ఇంగ్లీషు, తెలుగు మాటలతో సంప్రదించుకున్నాం. తర్వాత ఉభయులం వీరభద్రయ్యతో "ఒక్క అరగంటపాటు మీ జనం మొత్తాన్నీ అలా బయటకు తీసుకుని వెళ్ళండి. పోలింగ్ స్టాఫ్‌తో మాట్లాడి, అంతా సవ్యంగా జరిగేలా చూస్తా" అని విన్నవించుకునే రీతిలో మాట్లాడాము.

"అలా బయటకు వెళ్ళటం మా పద్ధతి కాదు. అయినా మీరు అభ్యర్థిస్తున్నారు కాబట్టి వెళతాం. కానీ, అరగంట అంటే అరగంటే! ఏం చేస్తారో, ఎలా చేసుకుంటారో- ఆ తర్వాత అరగంటలో పోలింగ్ ముగిసి పోవాలి. అవతల నా కోసం చాలా ఊళ్ళలో పోలింగ్‌లు ఎదురు చూస్తూ ఉంటాయి. అక్కడికి వెళ్ళిపోవాలి నేను" మా పట్ల చాలా దయతో వ్యవహరించినట్లు వీరభద్రయ్య బయటకు కదిలాడు. అతడితోపాటు జై జైలు కొట్టుకుంటూ అందరూ బయటకు వెళ్ళారు.

పోలింగ్ స్టాఫ్ తప్ప అంతా బయటకు వెళ్ళారని నిశ్చయించుకున్నాక -

"చూడు శివాజీ! ఇలాంటి సమయాలలోనే టాక్టు అంటే సమయస్ఫూర్తి చాలా అవసరం. మన ప్రాణాలకంటే ఈ ఎన్నికలు, ప్రజాస్వామ్య పరిరక్షణా ముఖ్యమా? అభ్యంతరం చెప్పగల ప్రత్యర్థు లెవరూ లేరు. ఎవరు ఓటు వేశారో, ఎవరు వేయలేదో అడిగే వారేరీ? బాలెట్లపై సంతకాలు పెట్టి, అలా కూర్చో. పోలింగ్ పూర్తవుతుంది. లేదంటావా, ప్రత్యామ్నాయం ఏమిటో చెప్పు అన్నాను.

"లేకుంటే లా అండ్ ఆర్డరు చాలా కష్టం" అన్నాడు సబ్ ఇన్స్పెక్టరు నా మాటలకు వత్తానుగా.

శివాజీ మా ఇద్దరి వేపు విచిత్రంగా క్షణ కాలం చూశాడు. ఆ చూపులలో ఏముందో నేను అర్థం చేసుకోకముందే, "చాలా అన్యాయం అంకుల్! బాధ్యత గల అధికారులుగా, ప్రభుత్వ, ప్రతినిధులుగా మనం ఈ దారుణాన్ని సహించటం ప్రజా ద్రోహం. ప్రత్యర్థి ఏజెంట్లను నెట్టి వేసి, దళితులను దౌర్జన్యంగా తరిమివేసి,

పోలింగ్ బూతులను ఆక్రమించిన ఈ వీరభద్రయ్యకు టాక్సు పేరిట మనం లొంగిపోవటమా? అంతకంటే ఆత్మ ద్రోహం మరొకటి ఉంటుందా? నాలో ప్రాణం ఉండగా ఒప్పుకోను." చాలా దృఢంగా, నిశ్చలంగా బదులిచ్చాడు శివాజీ

ముంచుకొస్తున్న ప్రమాదం ముందు మోకరిల్లి మా మాటలు ఖాతరు చేస్తా డనుకొన్న శివాజీ సమాధానంతో తెల్లబోయి మారు మాటాడలేకపోయాను.

"అంకుల్! లెట్ వాట్ మే కమ్! బాధ్యత నేనే తీసుకుని ఈనాటి పోలింగ్ ఆపివేస్తున్నాను. అలా రిపోర్టు రాస్తున్నాను కూడా. రూటు లారీలు రాగానే తిరిగి వచ్చేస్తాం. మీరు ఇక్కడ చేయగలిగింది ఏమీ లేదనుకుంటే వెళ్ళిపోవచ్చు-" చాలా నిష్కర్షగా చెప్పాడు శివాజీ.

క్షణకాలం నా బుద్ధి, మనస్సు, ఆలోచనలు, ప్రాజ్ఞత స్తంభించినట్లు అయ్యాయి. శివాజీని సమాధానపరచగల నేనే విషయాన్ని వదిలివేశాను. వీర భద్రయ్యను. అతగాడి ముష్కరమూకను ఎలా ఆపగలమా అనే ఆలోచనలో పడిపోయాను.

తామిచ్చిన అరగంట గడువు అయిపోయినట్లు బయటి నుండి ఒక్కసారి ఈలలు, జై జై నినాదాలు మిన్నుమిట్టాయి. వీరభద్రయ్య ఒక్కడే పోలింగ్ బూత్‌లోకి వచ్చి ఏమన్నట్లు మా కేసి చూశాడు.

ఎప్పుడు రాశాడో, ఓ ప్రకటనను తానే రాసి నోటిసు బోర్డుపై అంటించాడు శివాజీ.

"కొన్ని దౌర్జన్య సంఘటనల మూలంగా నిష్పాక్షికమైన పోలింగు సాధ్యపడనందున, ఈ నాటి పోలింగ్ వాయిదా వేయడమైంది.

ప్రిసైడింగ్ ఆఫీసర్ -ఇన్‌ఛార్జి, కలువపూడి

ఎదురుగా కనిపించిన ఈ ప్రకటన చూడగానే వీరభద్రయ్య నాటి వీరభద్రుడే అయ్యాడు. ఆ క్షణాన ప్రేలిన అగ్నిపర్వతపు నిప్పులా ఒక ఉదుటున రెచ్చిపోయాడు. పురి విప్పిన దౌర్జన్యంలా "అరేయ్!" అంటూ ఒక్క పెను కేక వేశాడు.

అంతలోనే ఏమైందో, ఏమో! బయట నుండి విచిత్రమైన సవ్వడి చెలరేగింది.

ఒకటే అలల హోరులా ఈలలు. అని వీరభద్రయ్య బంట్ల తాలూకు ఈలలు కావు. పోలీసు విజిల్సు. రయ్ఁ మంటూ ఒక దాని తర్వాత ఒకటి అయిదు వానులలో ఇనుప టోపీలు ధరించి, గన్స్‌తో స్పెషల్ పోలీసు దిగింది. స్కూలు ఆవరణ అంతా రేగిన దుమ్ముతో నిండిపోయింది. క్షణంలో వానుల నుండి దిగి గుంపులు గుంపులుగా ఉన్న జనాన్ని దూరంగా చెదరగొడుతున్న పోలీసుల అరుపులతో నిండిపోయింది వాతావరణం.

అప్పటి వరకు ఏమి చేయాలో అర్థం కాక. బిక్క చచ్చి నిల్చున్న సబ్ ఇన్‌స్పెక్టరు ఒక్క ఉదుటున విజృంభించి. చేతిలో ఉన్న టోపీని నెత్తిపై పెట్టుకుని జేబులోని పిస్టల్ చేత ధరించి, అట్టహాసంగా కదిలి లా. అండ్ ఆర్డర్‌తో బిజీ అయిపోయాడు.

అదనపు పోలీసు బలగాల కోసం ఫోను చేస్తున్న రిటర్నింగ్ ఆఫీసర్ గారి దగ్గరకు అనుకోకుండా వచ్చిన ఎస్.ఎ.పి. దళాలను కలువపూడి మళ్ళించారట.

వీరభద్రయ్య ఎప్పుడదృశ్యమయ్యాడో - కనిపించలేదు.

ఆ తర్వాత సంఘటనలను గురించి అంతగా చెప్పవలసిన దేమీ లేదు. ఆ మరునాడే కలువపూడిలో పోలింగ్ జరిగింది. అంతటి పోలీసు బందోబస్తుతో ప్రభుత్వ యంత్రాంగమంతా అక్కడ మోహరింపగా ఓటింగ్ జరిగింది. వీరభద్రయ్య ఆ ఛాయలకే రాలేదు. మొదటిసారిగా ఆ గ్రామంలోని సామాన్యులు. బలహీనులు, దళితులు, స్త్రీలు పోలింగ్‌లో పాల్గొన్నారు.

నియోజక వర్గమంతా కలువపూడి ఉదంతాన్ని విచిత్రంగా చెప్పుకున్నారు. విధి నిర్వహణలో ప్రిసైడింగ్ ఆఫీసరు ధైర్య స్థైర్యాలను వివరిస్తూ దినపత్రికలు బాక్సులు కట్టి వార్తలు ప్రకటించాయి.

ప్రతివారూ శివాజీని హీరోలా చూశారు. నా మటుకు నాకే; రోజూ నా ముందు ఆఫీసులో కనిపించే శివాజీకీ, కలువపూడి ఎన్నికలు ప్రారంభించిన తర్వాత రూపు దిద్దుకున్న శివాజీకీ సహస్రాంశంగా తేడా కనిపిచింది.

ఎన్నికలు ఫలితాలు మూడవ నాటికి తెలిశాయి. వీరభద్రయ్య మేనల్లుడు

అతి తక్కువ తేడాతో ఓడిపోయాడు. ఆ తేడా కలువపూడిదే అన్నారంతా.

★ ★ ★

ఫస్టు బస్సుకు రొంపిచర్ల కాంపు వెళ్ళటానికి తెల్లవారు జామున అయిదు గంట కల్లా స్నానం ముగించి అటెండరు రాక కోసం ఎదురు చూస్తున్నాను.

శివాజీ వచ్చాడు.

విష్ చేసిన శివాజీతో, "ఏం ఇంత పొద్దునే వచ్చావు?" అని ప్రశ్నించాను.

సమాధానం చెప్పలేదు. జేబులో నుంచి ఓ కాగితం నా ముందుంచాడు.

"ఏమిటి?" అంటూ చదివి, ఆశ్చర్యపోయాను. 'అవునా' అన్నట్లు మరోసారి చదివి - "వా టీస్ దిస్?" అసహనంగా ప్రశ్నించాను.

"బహుశా మీ కింకా తెలిసి ఉండదు. కలువపూడిలో వీరభద్రయ్య బలహీన వర్గాల వారి ఇళ్ళు తగుల పెట్టించాడు. బాంబులు రువ్వాడు. అనేకులు అమాయకులు క్షతగాత్రులయ్యారు. నలుగురు హరిజనులను సజీవ దహనం చేశారు. స్త్రీలను వివస్త్రలను చేశారు. ఒక్క కలువపూడే కాదు. ఇలాంటి దారుణ సంఘటనలు అక్కడక్కడా పెక్కు చోట్ల జరిగాయి. ఈ దేశంలో అయిదేళ్ళ కయిదేళ్ళకు ఎన్నికలు జరిగి ప్రజాస్వామ్య ఉద్ధరణ కాదు జరుగుతోంది - దానిని కూకటి వేళ్ళతో పెకలించే ప్రణాళిక అమలు జరుగుతోంది. దేశంలో నెలకొని ఉన్నది ఆరోగ్యకర రాజకీయం కాదు. ధన ప్రభావ రాజకీయం, సంకుచిత రాజకీయం, పైశాచిక, దొమ్మీ రాజకీయం, వర్గ మత ప్రాతిపదిక రాజకీయం, బలవంతుడు బలహీనుణ్ణి దోచుకుంటున్నాడు. అణగదొక్కుతున్నాడు. మితిమీరిన ఆశ, క్రౌర్యం, దగా, మోసం, వైలెన్సు ఈ దేశాన్ని అంధకారంలోకి నెడుతున్నాయి" శివాజీ బాధనంతా మూటకట్టినట్లు మాట్లాడాడు.

"అయితే దానికీ, నీ రాజీనామాకూ సంబంధమేమిటి?" చాలా అసహనంగానూ, చిరాగ్గానూ ప్రశ్నించాను.

"ఈ పరిస్థితిని చూస్తూ, సహిస్తూ, ఆమోదిస్తూ ఉండలేకపోతున్నాను అంకుల్!"- శివాజీ స్వరంలో చిత్తశుద్ధితో కూడిన ఏదో ఆవేదన ధ్వనించింది.

"ఇలాంటి పరిస్థితులలో నాలుగు జీతం రాళ్ళ కోసం రాజీ పడి, జాతి

భవిష్యత్తును, దేశ భవితవ్యాన్ని విస్మరించి, పిరికి వాళ్ళలా చేతులు ముడుచుకుని యువత ఉండిపోతే ఎలా చెప్పండి?"

శివాజీ స్పందిస్తున్న తీరు పట్ల నిశ్చేష్టితుణ్ణి అయినా, ఈ మహా జనారణ్యంలో శివాజీ ఒక్కడేపాటికి అనిపించింది!

"మహా జలధిలో ఒక చిన్న నీటి బొట్టు లాంటి నీవు... అనంతాకాశంలో ఒక ఒంటరి పక్షిలాంటి నీవు చేయగలిగిందేముంది శివాజీ!" చాలా అనునయంగా ప్రశ్నించాను.

"ఏదో చేయగలగాలి అంకుల్! తప్పకుండా ఏదో చేయగలిగిన దిశలోకే ప్రయాణించి ప్రయత్నించాలి. ప్రజలను మేల్కొలపాలి. వాళ్ళను జాగృతం చేసే ఉద్యమాలు నడపాలి. ఈ దేశం అందరి సొత్తు అని చెప్పాలి. దానిని కాపాడుకోవటం ప్రతి ఒక్కరి బాధ్యత అని చెప్పాలి. గతంలో ఎందరి త్యాగఫలమో ఈ స్వాతంత్ర్యం అని తెలియ చెప్పాలి. అందుకోసం వ్యక్తిగతంగా ఎంతటి మూల్యాన్నైనా చెల్లించాలి"

పద్దెనిమిది సంవత్సరాల పసికందు ఈ శివాజీ లక్ష్యమేమిటి? ఇతడేమవుతాడు? - నా మనస్సునిండా సంశయాలు ముప్పిరిగొన్నాయి.

ఒక్క క్షణం నా కళ్ళ ముందు భయంకరమైన ఏవో దృశ్యాలు మెదిలాయి.

పెరిగిన గడ్డంతో, మాసిన ఉడుపులతో, చంకన ధరించిన తుపాకితో కారడవులలో మన్యసీమలలో సంచరిస్తున్న శివాజీ!

ప్రభుత్వ పోలీసు బలగాలు, గ్రే హౌండ్ దళాలు తరుముతుండగా గుట్టలు, మిట్టలు పట్టి పరుగెడుతున్న శివాజీ!

గెరిల్లాలా శివాజీ!

రక్తసిక్తమైన తనువుతో ఎన్‌కౌంటర్‌లో శివాజీ!

దద్దరిల్లిన ఉలికిపాటుతో ఒక్కసారి 'నో' అనే దీర్ఘమైన అరుపు లాంటి కేకతో అ ప్రయత్నంగా లేచి నిల్చున్నాను.

ఎదురుగా చిరునవ్వుతో ఉన్న శివాజీని చూశాక తమాయించుకోగలిగాను.

"లే దంకుల్! నే నే వనసీమలకు పారిపోను. మీ అందరి మధ్యే ఉంటాను.

నా లక్ష్య సాధనకు దౌర్జన్యాన్ని సాధనంగా ఎంచుకోను. చీకటిని పారద్రోలే ఏదో ఒక చిరుదీపాన్ని వెలిగించే నూతన మార్గాన్నే అన్వేషించి అనుసరిస్తాను - సెలవు!" తన స్థిర సంకల్పాన్ని ఓ నమస్కారంతో నా ముందుంచి బయలుదేరెళ్ళిపోయాడు శివాజీ.

అక్కడి నుండి వెళుతూ శివాజీ వేస్తున్న ఒక్కొక్క అడుగులో ఒక్కొక్క చిరుదీపం వెలుగుతూ సర్వం కాంతిమయమవుతున్నట్లు అనిపించింది.

తూర్పున సూర్యుడు ఉదయిస్తున్నాడు.

శివాజీ ఎవరో నాకు ఆ క్షణాన నిజంగా అర్థమైంది. ●

## కథవెనుక కథః

*నాకు బాగా తెలిసిన ఒక ఉద్యోగి మరణించగా అతని కొడుక్కి ఉద్యోగమిచ్చారు. మా ఆఫీసులో నా పర్యవేక్షణ క్రింధేపని చేసేవాడతడు.*

*ఎంతో అమాయకుడనుకొన్న అతగాణ్ణి - అలా కాదనుకోవటానికి నాకు చాల కాలం పట్టింది. మామూలు ఉద్యోగ సంప్రదాయాలకు భిన్నంగా ఆలోచించి - మాట్లాడేవాడు. అవసరమైతే పోట్లాడేవాడు.*

*నాకనిపించేది - వేళ్ళూనిన చెడ్డ సంప్రదాయలపై తిరగబడటానికి ఇలాంటి ఒక్క వ్యక్తి చాలేమోనని.*

*ఓనాడతగాడు, ఉద్యోగం వదలివేసి అదృశ్యమయ్యాడు. తిరిగి రాలేదు.*

*(కథలోని ఇతర సంఘటనలు, పలుసందర్భాలలో నా కెదురైన అనుభవాల కూర్పు మాత్రమే-)*

★ *(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 19-12-1990)* ★